ప్రభుత్వాస్పత్రులను వేధిస్తున్న వైద్యుల కొరత

హైదరాబాద్, మార్చి 29 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రధాన ఆస్పత్రులలో వైద్యసేవలు రోగులకు అవసరమైన మేరకు అందడం లేదు. నానాటికి పెరుతున్న రోగులకు అవసరమైన మేరకు సేవలను విస్తృతం చేయాల్సి ఉండగా రోజు రోజుకు దిగజారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక సంవత్సరాల కిందట నిర్మించిన ఆస్పత్రి భవనాలలో ఏర్పాటైన వార్డులతోనే రోగాలకు చికిత్సలు అందజేస్తున్నారు. అప్పుడెప్పుడో అప్పటి అవసరాలకు ఏర్పాటైన వార్డులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అంతేకాకుండా అవుట్ పేషెంట్‌లకు అందాల్సిన సేవలు కూడా అంతంతమాత్రంగా మారాయి. రోగులకు ప్రధాన ఆస్పత్రుల గేటు నుంచే రోగుల సహనానికి పరీక్ష మొదలవుతోంది. నానా తంటాలు పడి ఓపీ చీటి సంపాదించినా కూర్చునేందుకు కుర్చీ ఉండదు. నిలబడేందుకు స్థలం దొరకదు. ఓపీ తీసుకున్నాక వైద్యుల రాకకోసం ఎదురు చూడాలి. సకాలంలో వైద్య సేవలు అందించడానికి వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రోగుల సంఖ్య విపరీతంగా ఉంటుండడంతో రోగుల సమస్యలు చెప్పుకోవడం పూర్తికాకముందే సెకన్‌ల వ్యవధిలో మరో రోగిని పిలుస్తుంటారు. రోగికి వచ్చిన జబ్బును నిర్ధారించడానికి రెండు రోజుల సమయంపడుతుండగా ఆస్పత్రిలో చేర్చుకోవాలంటే వైద్యులు అంతతేలికగా అంగీకరించరు. సాధ్యమైనంత వరకు రోగులకు అడ్మిట్ కాకుండానే చూస్తుంటారు. ఎవరిదైనా రికమెండేషన్ ఉంటేనో, రోగిని చేర్చుకోవడంతప్పనిసరైతే తప్ప ఆస్పత్రిలో అడ్మిషన్ దొరకదు. వైద్యులు, సిబ్బంది చీదరింపుల మధ్య వైద్య సేవలు పొందాల్సిందే. ఎందుకంటే వారంతా పేదలు, మధ్య తరగతివారే.

రోగులకు సరిపోని ఆస్పత్రులు....

నగరంలో పది సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు, రెండు అటానమస్ ఆస్పత్రులతో పాటు జిల్లా, ప్రాంతీయ, అర్బన్, సీహెచ్‌సీ, పీహెచ్‌సీలు ఉన్నాయి. ఆయా ఆస్పత్రులకు ప్రతిరోజు దాదాపు 16వేల నుంచి 18వేల వరకు, సీజన్‌లో అయితే దాదాపు 20వేలకుపై చిలుకు రోగులు వైద్య సేవలను పొందుతుంటారు. ఒక్క నీలోఫర్ ఆస్పత్రిలోనే ప్రతిరోజు దాదాపు 2వేల 5వందల మంది రోజులు ఆశ్రహిస్తున్నారు. ఇక నిమ్స్‌లో ఓపీ దాదాపు నాలుగువేలు దాటుతోంది. అర్థరాత్రి వెళ్లి క్యూలో నిలబడితే తప్ప ఓపీ దొరకని పరిస్థితి నెలకొంది. నగరంలో ఉన్న అన్ని ఆస్పత్రులలో ఉన్న బెడ్‌ల సంఖ్య కేవలం 9వేల 400, ఇంతమందికి సేవలు అందించడంలో ప్రస్తుమున్న ఆస్పత్రుల సంఖ్య సరిపోవడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ప్రధానఆస్పత్రులపై భారాన్ని తగ్గించడానికి నగర నలుదిశల నూతన ఆస్పత్రులు నిర్మిస్తున్నా అవీ సరిపోయే పరిస్థితి లేదు. ఒక రోగి వైద్య సేవలు పొందాలంటే దాదాపు ఒక రోజు పూర్తిగా కేటాయించాల్సిన పరిస్థితి. అడుగడుగునా నిరీక్షణలే.

అంతంత మాత్రంగా వైద్యులు.. సిబ్బంది...

నగరంలోని ప్రధాన ఆస్పత్రులలో సిబ్బంది కొరత ఇబ్బందికరంగా మారింది. రోగులకు ఉండాల్సిన రోగుల కంటే సగం మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఆస్పత్రులకు మంజూరైన పోస్టుల లో దాదాపు 50 శాతం పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. మెడికల్ కళాశాలలు అందుబాటులో ఉన్న అనుబంధ ఆస్పత్రులలో చాలా వరకు పీజీ విద్యార్థులే నెట్టుకువస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో కూడా వారే దిక్కవుతున్నారు. వైద్యులు, సిబ్బంది, ఇతర వైద్య సహాయకుల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రహించడం అంటే ప్రాణాలను వదులకోవాల్సిందేనని రోగులు అభిప్రాయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతగా వేధిస్తుండగా వైద్యులు, సిబ్బంది కొరతను తీర్చడం లేదు. ఉన్నకొద్దిపాటి వైద్యులు, సిబ్బందితోనే నెట్టుకువస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా ఆస్పత్రులకు వెళ్లాలంటే ప్రాణాలపై ఆశలు వదులుకున్నట్లే అనే దుస్థితి కనిపిస్తోంది.

గాంధీ దవాఖానలో...

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వెయ్యిపడకల నుంచి రెండువేల పడకలకు పెంచారు. అయితే వైద్యులు, సిబ్బంది కొరత మాత్రం వేధిస్తోంది. ఎక్స్‌రే ఫిలిం సరఫరా లేకపోవడంతో రోగులకు కంప్యూటర్‌మానిటర్‌పై ఫొటో తీసుకువెళ్లి వైద్యులకు చూపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాదాపు ఏడాది కాలంగా ఎక్స్‌రే ఫిలిం సరఫరా నిలిచిపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. సీటీ స్కానింగ్ తీసుకోవాలంటే కనీసం 5రోజులు వేచి ఉండాల్సిందే. ఎమ్మారై స్కానింగ్‌కు 15రోజులు. వాటి రిపోర్టులు పొందాలంటే మరో రెండు రోజులు వేచి ఉండాల్సిందే. ఇవన్నీ చూపించడానికి వైద్యులను కలవాలంటే మరో రెండు రోజులు వేచి ఉండక తప్పదు. వైద్య పరీక్షలు, మందులు రాయించుకోడానికి ఒక రోగి కనీసం నాలుగైదు సార్లైనా ఆస్పత్రి చుట్టు తీరగాల్సిందే. కంపుకొట్టే మరుగుదొడ్ల దుర్వాసన భరించలేక రోగులు ఆస్పత్రిని ఆశ్రహించడం కూడా మానుకుంటున్న సంఘటనలు చాలానే ఉన్నాయి. ఇక నీటి కొరత కారణంగా చాలాసార్లు ఆపరేషన్‌లు వాయిదా వేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి.

సరోజిని ఆస్పత్రిలో ఏజెంట్లదే హవా....

మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటిఆస్పత్రిలో ప్రతి విభాగంలోనూ ఏజెంట్లు, అవినీతి, అక్రమ కలెక్షన్లు రాజ్యమేలుతున్నాయి. అక్కడ ఏజెంట్లు ఆడిందే ఆట, పాడిందే పాట, రోగులు తెల్లవారుజాము నుంచే ఆస్పత్రిలో బారులు తీరుతున్నారు. రోజు 1000కి పైగా ఓపీ నమోదవుతోంది. ఓపీ తీసుకుని సిబ్బందికి రూ.200 నుంచి రూ.300ఇస్తే మనకు కావాల్సిన కౌంటర్ దగ్గరకు తీసుకెళతారు. క్యాటరాక్ట్ ఆపరేషన్ కావాలంటే రూ.500 ఇవ్వాలి. వార్డు నుంచి నేరుగా ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లిపోతారు. అక్కడ లైను, నెంబర్లతో సంబంధం లేకుండా చికిత్స అందుతుంది. ఆస్పత్రిలో ఇచ్చిన కళ్ల జోళ్లు పని చేయవని, ఫలానా దుకాణంలో కొనుగోలు చేయాలని రోగులకు చెబుతున్నారు. దీనికిగాను దుకాణాల నుంచి కమషన్లు తీసుకుంటున్నారు.

ఎంఎన్‌జెలో దుస్థితి...

రోగాన్ని నయం చేసుకోడానికి వచ్చి రోగాల బారిన పడుతున్నారు. రోగాలు వచ్చిన వారు ఓపీ తీసుకోవడం కోసం ఎంతమాత్రం ఓపిక లేక ఇబ్బందులు పడుతున్న రోగులకు కనీసం కూర్చోడానికి అవకాశంలేక నానా అవస్థలు పడుతున్నారు. మెట్లు, ఆరుబయట కూరోచవడం, మరీ ఓపికలేని వారు అక్కడే పడకేస్తున్నారు. నిత్యం దాదాపు ఎనిమిది వందల నుంచి వెయ్యి మంది వరకు ఓపీలు తీసుకుంటున్నారు. ఒక్కోరోగి కేన్సర్, స్క్రీనింగ్, సన్నద్ధత, ఆపరేషన్ కోసం సమాయత్తం పేరుతో మళ్లీమళ్లీ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సరిపడా బెడ్లులేని కారణంగా రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గరు పిల్లలకు వైద్యం చేస్తున్నారు. బెడ్‌ల సంఖ్య చెబుతున్నప్పటికి సంవత్సరాలు గడుస్తున్నాయితప్ప కార్యరూపం దాల్చడం లేదు.

నీలోఫర్ ఆస్పత్రిలో.....

నీలోఫర్ ఆస్పత్రిలో నిత్యం 15 వందలకు పైగా ఓపీలు నమోదు అవుతున్నా సరిపడా వసతులు మాత్రం అందుబాటులో లేవు. ఇక్కడా బెడ్‌ల కొరత తీవ్రంగానే ఉంది. సంవత్సరాలుగా బెడ్‌లను పెంచుతామని చెబుతున్నప్పటికి అమలు కావడం లేదు. అంతకంటే ముఖ్యంగా రోగులు వినియోగించుకోడానికి లిఫ్టులు సక్రమంగా పని చేయడం లేదు. ఇక్కడ ఏర్పాటైన వెయిటింగ్ హాలు మూడు సంవత్సరాలుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. రోగులకు ఇచ్చే ఆహారం ఏమాత్రం నాణ్యతలేదని అంటున్నారు. ఇప్పటికే అనేక ఫిర్యాదు అందినప్పటికి ఆహారంలో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదని రోగులు చెబుతున్నారు. రోగుల సహాయకుల తిప్పలు అన్నీ ఇన్నీ కావు. సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం సర్వసాధారణంగా మారింది.

ఉస్మానియాకొస్తే ఆశ వదులకోవాల్సిందే...

రోగులు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఉస్మానియాకు బదిలీ చేస్తున్నామని చెప్పగానే రోగి బంధువులు రోగిపై ఆశలు వదులకుంటున్నారు. రోగిని ఇన్‌పేషెంట్‌గా చేర్చుకోవాలన్నా, బెడ్ ఏర్పాటు కావాలన్నా రికమెండేషన్ చేసుకోవాల్సిందే. ఉస్మానియాలో నిత్యం దాదాపు రెండు వేలమంది రోగులు ఓపీలు తీసుకుంటున్నారు. వైద్యం కోసం ఉస్మానియాకు వచ్చిన వారిలో డెత్‌రేటు కూడా ఎక్కువగానే ఉంటోంది. శిథిలమైన ఈ ఆస్పత్రిలో చికిత్స అనగానే రోగులు భయాందోళనకు గురవుతున్నారు. రోగులకు వైద్య సేవలను అందించడంలో నిర్లక్ష్య వైఖరి కనబరుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మార్చురీ నిర్వహణ మరీ అధ్వాహ్నంగా తయారైందని రోగులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రుల తీరు ఇలాం ఉంటే చిన్నచిన్న ఆస్పత్రులలో వైద్య సేవలు ఎలా ఉంటున్నాయో ఊహించుకోవచ్చు.

హైదరాబాద్ వార్త

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అందని ప్రొసీడింగ్స్

హైదరాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: హెచ్ఎండీఏ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కోసం చేసుకున్న దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లక్షలాది మంది దరఖాస్తులు చేసుకున్నా ఫలితం మాత్రం కొందరికే దక్కింది. దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా ప్రొసీడింగ్స్ లభించక దరఖాస్తుదారులు నానా అవస్థలు పడుతున్నారు. వేలాదిమంది అధికారుల సూచనల మేరకు ఫీజులు చెల్లించినా, రూ. కోట్లు ఆదాయం సమకూరినా ప్రొసీడింగ్స్ అందకపోవడం అధికారుల ఉదాసీనత వైఖరికి నిదర్శనంగా కనిపిస్తోంది. దరఖాస్తుదారులు మాత్రం కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అంతేకాకుండా ఒకే ప్రాంతానికి చెందినవారు దరఖాస్తులు చేసుకుంటే కొందరికి రూ. వేలల్లో ఫీజులు చెల్లించాలని నోటీసులు వస్తే, మరి కొందరికి రూ. లక్షల్లో ఫీజులు చెల్లించాలని నోటీసులు అందుతున్నట్లు తెలుస్తోంది. దీంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. కేవలం రెండువందల యాభై గజాల స్థలానికి కొందరికి రూ. 20 వేలలోపే ఫీజు చెల్లించాల్సి వస్తుండగా, అంతే స్థలానికి మరి కొందరికి రూ.లక్షకు పైగా చెల్లించాలని నోటీసులు అందాయి. దీంతో దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంది.

లక్షల్లో దరఖాస్తుదారులు...

హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 3 లక్షల 45 వేలమంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్ 2020 పథకంలో భాగంగా ఈ దరఖాస్తులు అందాయి. ఇందులో కేవలం సుమారు 60 వేల మంది ఫీజులు చెల్లించారు. ఫీజుల రూపంలో ఇప్పటివరకు హెచ్ఎండీఏకు రూ. 160 కోట్లు సమకూరాయి. అనేక రకాల కారణాలు చూపించి దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ అందజేయడంలో లోపాలు తలెత్తుతున్నాయి. లక్షల్లో దరఖాస్తుదారులు అందరూ ఫీజులు చెల్లించి ఉంటే హెచ్ఎండీఏకు ఫీజుల రూపంలో కనీసం 16 వందల కోట్లు సమకూరేది. కాని అధికారుల నిర్లక్ష్యమో, సాంకేతిక సమస్యలో సమకూరాల్సిన ఆదాయం మాత్రం లభించడం లేదు. చిన్నచిన్న సాంకేతిక, అవగాహన సమస్యల కారణంగా హెచ్ఎండీఏ ఆదాయాన్ని కోల్పోతోంది. ప్రొసీడింగ్స్ అందకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కారణాలు ఏమైనప్పటికి లక్షల కొద్ది దరఖాస్తులు పెండింగ్‌లో పడిపోయాయి. ప్రభుత్వం 25శాతం ఫీజు తగ్గింపు సదుపాయం కొన్ని ఉన్నప్పటికి ఉపయోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు.

కేవలం పది రోజుల్లోనే...

ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి కేవలం పది రోజుల్లోనే ప్రొసీడింగ్స్ అందుతాయని అధికారులు అప్పట్లో చెప్పారు. కాని వాస్తవ రూపంలోకి వస్తే నెలరోజుల గడుస్తున్నా ప్రొసీడింగ్స్ అందే పరిస్థితి కనిపించడం లేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఇలాంటి వారి సమస్యలు పరిష్కరించడం కోసం హెచ్ఎండీఏలో ఎల్ఆర్ఎస్ సహాయకేంద్రాన్ని సంప్రదించినా అంత తేలిగ్గా పరిష్కారం లభించే అవకాశాలు కనిపించడంలేదని ఆందోళనకు గురవుతున్నారు. అన్ని నిబంధనలు పాటించి పీజులు చెల్లించినా సమస్యలు తప్పడం లేదు. కేవలం పది దినాల్లో అందజేస్తామని చెప్పిన అధికారులు నెలలు గడుస్తున్నా సమాధానం చెప్పడానికి కూడా స్పందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలాసార్లు సమాధానం చెప్పడానికి అధికారులు అందుబాటులో ఉండకపోవడమే కాకుండా కార్యాలయానికి ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందని దరఖాస్తుదారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఒకే ప్రాంతానికి చెందిన స్థలాల వారు అధికారులు రకరకాల ఫీజులు నమోదు చేస్తున్నారు. నిబంధనల మేరకు 250 గజాల స్థలానికి కొందరికి రూ. 18 వేలు ఫీజు నోటీసులు అందగా అంతే స్థలానికి మరికొందరికి రూ.1లక్షా 15వేలు చెల్లించాలని నోటీసులు అందాయి. ఇదేమని అడిగితే సమాధానం చెప్పడానికి అధికారులు నిరాకరిస్తున్నారని చెబుతున్నారు. ఇందుకు సర్వే నెంబర్‌లు, ఫ్లాట్‌ల నెంబర్‌లు అప్పుగా నమోదు చేయడమే కారణంగా తెలుస్తున్నట్లుగా సమాచారం. దీన్ని సరిదిద్దడం అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారింది.

కరెక్షన్ పేరిట వసూల్‌లు...

కొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్లు, ఫ్లాట్ నంబర్లు తప్పుగా నమోదవుతున్నాయి. ఇలాంటి తప్పులను సరిదిద్దేందుకు దరఖాస్తుదారులు అధికారుల చుట్టూ తిరగాల్సివస్తోంది. సర్వే నంబర్‌లు, ఫ్లాట్ నంబర్‌లు తప్పుగా నమోదు కాబడం వల్ల ఒకే ప్రాంతంకు చెందిన ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల ఫీజుచెల్లింపు నోటీసులు అందుతున్నాయి. దీన్ని సరిదిద్దడంకోసం దరఖాస్తుదారులు వాటిని సరిదిద్దించుకోడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించడం కోసం కొన్ని కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. ఇందులో కొందరు కరెక్షన్ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పనిలో పనిగా కార్యాలయాల వద్ద కొందరు దళారులు కాపుకాచి ఉంటున్నారు. వీరి చేతిలో పడి నష్టపోవాల్సి వస్తోంది. ఇలాంటి సమస్యలను పరిష్కరించడం కోసం అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అలాగే హెచ్ఎండీఏ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం అధికారులు చిత్తశుద్ధితో విధి నిర్వహణ సాగించాల్సి ఉంది.

పంజాగుట్టలో కారు బీభత్సం

జూబ్లీహిల్స్, మార్చి 29, ప్రభాతవార్త: పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున వెంగళరావు పార్కు సమీపంలో వేగంగా వెళ్తున్న వోక్స్‌వ్యాగన్ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా డివైడర్‌ను ఢీకొట్టి, మరింత ముందుకు దూసుకెళ్లి మిడ్‌టౌన్ భవనం పక్కన ఉన్న కొబ్బరి కాయల బండిని ఢీకొట్టింది. ఈ ఘటన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని, ముషీరాబాద్‌కుచెందిన డ్రైవర్ అనాస్(20)ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

239 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్, మార్చి 29 ప్రభాతవార్త : మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడంలో భాగంగా ఈనెల 27,28వ తేదీల్లో నగరవ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ రెండు రోజుల తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మొత్తం 239 మందిపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వాహనాల వివరాలు ప్రకారం ద్విచక్ర వాహనాలు 190, త్రీవీలర్లు 18, ఫోర్‌వీలర్లు మరియు ఇతర వాహనాలు 31 మంది పట్టుబడ్డారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల నివారణ దృష్ట్యా ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. రోడ్డు నిబంధనలను పాటించి, సురక్షితమైన ప్రయాణానికి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

పోలీసులపై దాడి చేసిన ఇద్దరు అరెస్టు

హైదరాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: నగరంలోని మెహిదీపట్నంలో పోలీసులపై దాడి ఘటన వెలుగులోకి వచ్చింది. మాసబ్‌ట్యాంక్ పరిసర ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను క్యాట్ వింగ్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఆపి ప్రశ్నించగా.. వాగ్వాదానికి దిగారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ అలీఖాద్రిలు అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో వారిని నిలదీశారు. అయితే, వారిని ప్రశ్నించినందుకు ఆగ్రహించిన నిందితులు ఒక్కసారిగా రెచ్చిపోయి పోలీసులపై దాడికి దిగారు. కర్రలు, రాళ్లతో కానిస్టేబుళ్లపై దాడి పాల్పడ్డారు. అయినప్పటికీ అప్రమత్తంగా వ్యవహరించిన పోలీసులు దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగుతుందని, విధుల్లో ఉన్న పోలీసులపై దాడిచేయడం తీవ్రమైన నేరమని అధికారులు హెచ్చరించారు.

యువకుడిపై కత్తితో దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 27 ప్రభాతవార్త : పాత కక్షలు కారణంగా ఓ యువకుడిపై కత్తితో దాడిచేసినవ్యక్తిని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి కత్తి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...వాంబేకాలనీకి చెందిన మేస్త్రీ మన్యం కుమారుడు రఘుపతి,లక్ష్మీగూడ వాంబే కాలనీలో నివాసం ఉంటున్న బిహార్‌కు చెందిన వివేక్ మండల్(22) అన్న దమ్ములు మధ్య వివాదం జరిగింది. ఈనేపథ్యంలో రఘుపతిని హత్య చేయాలని వివేక్ పథకం వేశాడు. వివేక్ కత్తితో రఘుపతి మెడపై దాడిచేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం రఘుపతి మైలార్‌దేవ్‌పల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రఘుపతిని హత్యచేయటానికి ప్రయత్నించిన వివేక్ మండల్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. అతని నుంచి కత్తి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ స్థల ఆక్రమణపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, మార్చి 29, ప్రభాతవార్త: బంజారాహిల్స్‌లో అంగన్‌వాడికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై షేక్‌పేట తహసిల్దార్ అనితారెడ్డి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఉదయ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణం కోసం 2018లో జిల్లా కలెక్టర్ అధికారికంగా కేటాయించారు. అయితే దశరథ్ అనే వ్యక్తి ఆ భూమిని అక్రమంగా ఆక్రమించి ఇల్లు నిర్మించినట్లు ఆరోపణలున్నాయి. ఇదే విషయంపై రెవెన్యూ అధికారులు పరిశీలన చేపట్టి, టీఎస్ఎల్ఆర్ రికార్డుల ప్రకారం ఆ భూమి ప్రభుత్వానికి చెందినదని నిర్ధారించారు. 98 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమిని ఇప్పటికే అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఇంతకుముందు కూడా దశరథ్ అక్రమ నిర్మాణానికి ప్రయత్నించగా అధికారులు అడ్డుకోవడంతో, హైకోర్టు ఉత్తర్వులను చూపిస్తూ అధికారులను బెదిరించారు. దీంతో అంగన్‌వాడీ అధికారులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికితోడు స్థలంలో కొంత భాగాన్ని విక్రయించేందుకు సైతం ప్రయత్నాలు చేశాడు. ప్రస్తుతం ఆ స్థలంలో నిర్మాణం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో దశరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, భూమిని అంగన్‌వాడీ కేంద్రానికి తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. అలాగే 24 గంటలు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే పార్టీ టిడిపి

తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్

ముషీరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త: తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పార్టీ తెలుగుదేశం అని పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని జిల్లా పార్టీకార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అరవింద్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ పతాక ఆవిష్కరణచేసి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి, పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీ రామారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పేదప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, ప్రజల హృదయాలలో నిలిచిపోయారని గుర్తు చేశారు. ఆ మహనీయుని వల్లనే పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా, ఎల్లప్పుడూ ప్రజల కోసమే, ప్రజలతో మమేకమై ఉంటుందని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా, ఆయన ఆదర్శాల కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా చేపడుతన్న సంక్షేమ సథకాలకు ఆద్యుడు అయిన ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శ్యాంసుందర్, పరశురాం, కిరణ్, భానుప్రకాష్, ఎస్.ప్రకాష్, చంద్రమోహన్‌గౌడ్, నాయుడు, ఓ.వెంకటేష్‌చౌదరి, వై.ఎల్.నర్సింహగౌడ్, సత్యనారాయణ, ఆనంద్, శక్తిప్రేమ్, సాయి, సుక్రవేది, యాదగిరి పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం.. కేక్ కట్‌చేస్తున్న అరవింద్‌కుమార్‌గౌడ్

ఆల్ ఇండియ పోలీస్‌మీట్‌కు ఎస్ఐ ప్రేమ్‌సాగర్ ఎంపిక

కుత్బుల్లాపూర్, మార్చి 29 ప్రభాతవార్త : జాతీయస్థాయిలో నిర్వహించే ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌కు జీడిమెట్ల పోలీసు సబ్ ఇన్స్‌స్పెక్టర్ ప్రేమ్‌సాగర్ ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులతో కూడిన తెలంగాణ ప్రతినిధిజట్టులో ప్రేమ్‌సాగర్ చోటుదక్కించుకున్నారు. ఈ సందర్భంగా జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ మాట్లాడుతూ ప్రేమ్‌సాగర్ క్రమశిక్షణ, విధినిర్వాహణపట్ల నిబద్ధత ఆయనను ఉన్నతస్థాయికి చేర్చుతాయని అభినందించారు. ముఖ్యంగా జాతీయస్థాయిలో ఆరుకీలక విభాగాలు క్రమ్‌సీన్ ఫోటోగ్రఫీ, క్రిమినల్ చట్టాలు, లిఫ్టింగ్‌ప్యాకింగ్ హ్యాండ్లింగ్, వేలిముద్రల విశ్లేషణ, పరిశోధనకు శాస్త్రీయ సహాయం వంటి అంశాలలో జాతీయస్థాయిలో డ్యూటీమీట్ ఉంటుందని ఆయన పేర్కొన్నార. గతంలో జరిగిన రాష్ట్రస్థాయి డ్యూటీమీట్‌లో రెండు బంగారు, ఒకవెండి,కాంస్య పతకాలను సాధించినట్లు గడ్డంమల్లేశ్ తెలిపారు. తెలంగాణ పోలీసుల ప్రతిభకు ప్రతిరూపంగా నిలుస్తున్న ప్రేమ్‌సాగర్ భవిష్యత్‌లో మరిన్ని ప్రతిభాపురస్కారాలు సాధించి మంచి గుర్తింపు పొందాలని సూచించారు.

నెల్లికంటి సత్యం, సీపీఐ నారాయణ

అక్రమ నిర్మాణాలను చేపట్టేవారిని అరెస్ట్ చేయాలి

ముషీరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త: ఇందిరాపార్కులో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా కరాటే క్లాసు పేరుతో నిర్మాణాలు చేపడుతున్నవారిని అరెస్ట్ చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయనేత నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం వారు ఇందిరాపార్కు పరిసర ప్రాంతాలను సందర్శించి, అక్రమనిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడాల్సిన ఇందిరా పార్కులో, ఎటువంటి అనుమతులులేకుండా, కరాటే తరగతులు నిర్వహిస్తూ, ఇప్పుడు పార్కు గోడను కూల్చివేసి, కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంటి పన్నులు చెల్లించవద్దని ప్రజల తీర్మానం

అధిక పన్నులను సవరించనందుకు నిరసనగా జిల్లెలగూడ, మీర్‌పేట్ ఏకగ్రీవ నిర్ణయం

పన్నుల తగ్గింపు కోసం ఇంటింటా చేపట్టనున్న సంతకాల సేకరణ ఉద్యమం

పన్నులు తగ్గకపోతే నిరాహార దీక్షలకు సిద్ధమన్న కాలనీ సంఘాలు

సిఎం దృష్టికి తీసుకెళ్లే నిమిత్తం ప్రజా సంతకాల ప్రతులను విడుదల చేస్తున్న మేకల రవీందర్‌రెడ్డి

సరూర్‌నగర్, మార్చి 29 ప్రభాతవార్త: పునర్వ్యవస్థీకరణ జరిగి జిహెచ్ఎంసిలో విలీనమైన హైదరాబాద్ సమీపంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన జిల్లెలగూడ, మీర్‌పేట్ ప్రజలు 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు చెల్లించవద్దని తీర్మానించారు. జుబ్లిహిల్స్, బంజారాహిల్స్‌లలో కంటే అధికంగా విధించిన ఇంటి పన్నులను సవరించాలని కొన్ని సంవత్సరాలుగా విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వాలు మారినా పన్నులభారం తగ్గకపోవడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం కర్మన్‌ఘాట్ ఇన్నర్‌రింగ్ రోడ్డు మంద మల్లమ్మ చౌరస్తా సమీపంలోని వంగ అనంతరెడ్డి గార్డెన్స్‌లో జిల్లెలగూడ మాజీ ఉప సర్పంచ్ మేకల రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా ఏర్పాటు చేసిన సమావేశంలో పన్నుల విషయమై పలు తీర్మానాలు చేశారు. జిల్లెలగూడ, మీర్‌పేట్ కాలనీ సంఘాలు, వివిధ కాలనీవాసులు, పాత గ్రామాలు, వీకర్ సెక్షన్ ప్రాంతాల ప్రజలు హాజరైన ఈ కీలక సమావేశంలో పన్నుల సవరణపై ముక్తకంఠంతో ఏకగ్రీవ తీర్మానం చేశారు. అంతకుముందు సమావేశంలో మేకల రవీందర్‌రెడ్డితోపాటు వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, కాలనీవాసులు మాట్లాడుతూ పన్నుల భారాన్ని, తగ్గించని అధికారుల బాధ్యతారాహిత్యాన్ని ఎండగట్టారు. పక్కనున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్, జిహెచ్ఎంసి డివిజన్ల కంటే జిల్లెలగూడ, మీర్‌పేట్‌లలోనే అధికంగా పన్నులు విధించారనీ ఒక దశలో సంపన్నులు నివసించే జుబ్లిహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల కంటే ఎక్కువే ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఏకంగా నాలుగైదు రెట్లు అధికంగా ఉన్న పన్నులను తగ్గించాలని గతంలో ఎన్నోసార్లు అప్పటి మున్సిపల్ కమిషనర్‌కు, సిడిఎంఎలకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని వారు తెలిపారు. ప్రభుత్వాలు మారినా తమ ప్రాంతాలు జిహెచ్ఎంసిలో విలీనమైనా పన్నుల సవరణ మాత్రం కాలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించామని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రారంభంకానున్న ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నులు చెల్లించకూడదని ఏకగ్రీవంగా నిర్ణయించారు. పన్నుల సవరణ చేయాలని ప్రతి కాలనీ, ప్రతిప్రాంతంలో ప్రజలతో సంతకాల సేకరణ చేసి రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబును అదే విధంగా సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించాలని వారు నిర్ణయించారు. పన్నుల సవరణ జరిగి తగ్గకపోతే రిలే నిరాహార దీక్షలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు పలు కాలనీ సంక్షేమ సంఘాల వారు ఈ సమావేశంలో ప్రకటించారు. న్యాయబద్ధంగా పన్నుల సవరణ జరిగే వరకు పోరాడాలని వారు తీర్మానం చేశారు. సమావేశంలో వివిధ కాలనీ సంఘాలకు చెందిన ఎస్ఎల్‌కె శ్రీనివాస్, పాపరాజు, వరహాలరావు, అంజయ్య, మానాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పార్టీ శ్రేణులు

కెపిహెచ్‌బిలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 29, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని, కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ జేఎన్‌టియు సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా జరిపారు. అనంతరం రమ్యా మైదానం వద్ద, వసంత నగర్ బస్టాప్‌వద్ద జెండా ఆవిష్కరించి స్వీట్లు, మిఠాయిలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాయకురాలు ఉప్పల పద్మాచౌదరి, డివిజన్ నాయకులు షేక్ సత్తార్, అట్లూరి దీపక్, శివసత్యనారాయణ, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, జాస్తి రమాదేవి, కొల్లూరి శ్రీనివాస్, కాకర్ల గోపికృష్ణ, కెవిఆర్ చౌదరి, అన్నే శాస్త్రీ, చంద్రరావు, రేఖ, మదన్మోహన్ దొప్పలపూడి, ఆనందరావు, సరళ, చెరుకూరి రవి, పవన్ మార్ని, రామకృష్ణ పొట్లూరి, రాజేష్ పొట్లూరి, దొరబాబు, గౌరీ శంకర్, సాంబశివరావు, మొర్ల రామకృష్ణ, మణిదీప్, గౌతమ్, సురేష్, సాయి, నరేంద్ర, నవీన్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్‌నగర్‌లో...

టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నర్సింహులు తదితరులు

జూబ్లీహిల్స్, మార్చి 29, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ 44వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకను ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ జ్ఞానీ జైల్ సింగ్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ నేత ఎం. నర్సింహులు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసి ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో టిడిపి జూబ్లీహిల్స్ డివిజన్ నేతలు పి. యాదగిరి, బి. మల్లేష్, గోవింద్, ఆటో సలీం, షేక్ సలీం, పి.అరవింద్, నరేష్, ఎం.సాయికుమార్, రాము, ఎం. వెంకటేష్, గుట్టలపల్లి నాగరాజ్, రవి రాజు, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

నిజాంపేట్, మార్చి 29, ప్రభాతవార్త : బాచుపల్లి డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నిత్యావసరాలైన తాగునీరు సరఫరా, పార్కులు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, బస్తీ దవాఖానా, ప్రభుత్వ పాఠశాల వివిధ ప్రజా సౌకర్యాలు అన్నీ మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి కొరత ఉన్న చోట ఎంపీ నిధుల నుండి బోర్స్ వేయిస్తానని చెప్పారు. పలు సమస్యలపై స్థానిక బీజేపీ నాయకులు గజ్జెల్లి సంతోష్‌కుమార్ ప్రజలతో మాట్లాడి ఎంపీ ఈటల రాజేందర్‌కు వివరించారు. పర్యటనలో ప్రజలు బీజేపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

సురేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

చిక్కడపల్లి, మార్చి 29 (ప్రభాతవార్త) : తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది ఎస్.సురేందర్ రెడ్డిని ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్.మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఈ అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు కె. రామానందం, వి. నాగభూషణం హాజరై సురేందర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎస్. మనోహర్ రెడ్డి, కార్యదర్శి ఎం.దశరథ్, రవి కుమార్, ఉపాధ్యక్షులు కళ్యాణ్‌నాయక్, మన్నే దామోదర్ రెడ్డి, సంపత్‌రెడ్డి, మాధవ రావు, శైలజ మోహన్, క్లబ్ మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, శంకర్‌రావు, ఎస్.రమేష్ రెడ్డి, ఆర్.వివేక్, పి.వి.నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు జిమ్ అవసరం : ఎమ్మెల్యే

కంటోన్మెంట్, మార్చి 29 ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, ఆరోగ్యం బాగుంటేనే మనమంతా ఉత్సాహంగా పనిచేస్తామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం 5వ వార్డు ఇంద్రపురి రైల్వే కాలనీలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ దైనందిన ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. మానసిక ఆరోగ్యంతో శారీరక దృఢత్వం కూడా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పెద్దాల నర్సింహ, గుజ నాగేందర్‌యాదవ్, చిర్రబోయిన సంతోష్‌యాదవ్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కొంపల్లి సర్కిల్‌లో ప్రాపర్టీ ట్యాక్స్ ప్రత్యేక డ్రైవ్..

కొంపల్లి, మార్చి 29, ప్రభాతవార్త

2025-26 ఆర్థిక సంవత్సరం సందర్భంగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లలో భాగంగా కొంపల్లి సర్కిల్ పరిధిలో అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి ఎస్టేట్‌లో తనిఖీలు చేపట్టగా, అక్కడ పలు మల్టీనేషనల్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అయితే సంబంధిత కమర్షియల్ ప్రాపర్టీకి సంబంధించిన పన్నులు దీర్ఘకాలంగా బకాయిగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం బకాయి సుమారు రూ.22 లక్షలు ఉన్నట్లు అంచనా వేశారు. పలుమార్లు నోటీసులు జారీచేసినప్పటికీ పన్ను చెల్లింపులు జరగక పోవడంతో, ఆదివారం గోదాముల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆక్యుపైయర్స్‌కు రెడ్‌నోటీసులు జారీ చేశారు. ఈ ప్రాంగణంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలలో ప్రోకనెక్ట్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్, అశోక టైర్స్ ఇన్‌స్టామార్ట్, బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్, సూపర్ మార్కెట్ గ్రోసరీ సప్లైస్ ప్రైవేట్ లిమిటెడ్, వేక్‌ఫిట్ ఇన్నోవేటివ్ లిమిటెడ్, రెడింగ్టన్, ఓమ్నిన్యూటిక్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, బయో లాబ్స్ అండ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థలు ఉన్నాయి. మొత్తం 13 ప్రాపర్టీల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేయగా, ఆదివారం టెనెంట్లకు నోటీసులు అందజేశారు. అదనంగా నేచురల్స్ హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్, కేఎఫ్సీ, పరడైస్ ఫేవరెట్ బిర్యానీ వంటి వాణిజ్య సంస్థల టెనెంట్లకు రెడ్ నోటీసులు జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ యాక్ట్ 1955 ప్రకారం, 7 రోజుల్లోగా బకాయి ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించాలని ఆదేశించారు. గడువులోపు చెల్లించని పక్షంలో సంబంధిత కమర్షియల్ సంస్థలను సీజ్ చేయడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపార సంస్థలు తమ ప్రాపర్టీ ట్యాక్స్‌ను సమయానికి చెల్లించి ఇలాంటి పరిస్థితులను నివారించుకోవాలని కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణరెడ్డి సూచించారు.

రూ.22 లక్షల బకాయిలపై రెడ్ నోటీసులు

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం మేళా...

ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల ప్రత్యేక డ్రైవ్‌తో పాటు, కొంపల్లి సర్కిల్ పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం మేళా నిర్వహించారు. ఈ మేళా ద్వారా పన్ను చెల్లింపుదారుల సమస్యలు, బకాయిల పరిష్కారం కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి సేవలు అందించారు. ఈ సందర్భంగా కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణరెడ్డి మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు తమ ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలను త్వరితగతిన చెల్లించి వడ్డీలు, జరిమానాలను నివారించుకోవాలని సూచించారు. అలాగే, వడ్డీ బకాయిలపై ప్రభుత్వం 90 వరకు తగ్గింపు కల్పించిన నేపథ్యంలో అందరూ ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మేళాలో అందుబాటులో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో పన్ను చెల్లింపుదారులు హాజరై, తమ సందేహాలను నివృత్తి చేసుకుని బకాయిల చెల్లింపులపై ముందుకు వచ్చారు.

ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లపై సమీక్ష సమావేశం..

గరిష్ట వసూళ్లకు కార్యాచరణపై దృష్టి

2025-26 ఆర్థిక సంవత్సరాంతం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల పురోగతిపై కొంపల్లి సర్కిల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణరెడ్డి నిర్వహించగా, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌గౌడ్, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లను మరింత మెరుగుపరచి గరిష్టస్థాయిలో వసూళ్లు సాధించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు.

బకాయి పన్నులపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ వసూళ్లు చేపట్టాలని, అవసరమైతే కఠిన చర్యలు కూడా తీసు కోవాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి 2025-26 ఆర్థిక సంవత్సరంలో మాక్సిమమ్ వసూళ్లు సాధించాలని ఆయన పేర్కొన్నారు.

అవార్డు గ్రహీతలతో ఏనుగు నరసింహారెడ్డి తదితరులు

వృద్ధులను గౌరవించుకోవడం మన సంప్రదాయం

రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి

రవీంద్రభారతి, మార్చి 29 ప్రభాతవార్త : వృద్ధులు విజ్ఞానం, పరిజ్ఞానం మేళవించిన మేధాసంపన్నులని, వారు బరువుకాదు బాధ్యాతాయుతమైన గొప్ప తరగని సంపదన్న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి వయోవృద్ధులను గౌరవించుకొని వారి శుభాశీస్సులు పొందడం మన సంప్రదాయమన్నారు. తెలంగాణ సీనియర్ సిటిజెన్ కాన్ఫెడరేషన్, తెలంగాణ స్త్రీ సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నరసింహారెడ్డి భారతీయ సంస్కృతిలో మహిళలను మహారాణులు, దైవస్వరూపులని అన్నారు. అనంతరం విశిష్ట అతిథులు డా. లావణ్య, డా. ముక్తేవిభారతి, పి.రామచంద్రయ్య తదితరులతో కలిసి హైమవతి భీమన్నను ఘనంగా సత్కరించి సరోజినీనాయుడు అవార్డు; డా. శ్రీలత బర్నాడ్‌ను ఘనంగా సత్కరించి డెడికేటెడ్ డాక్టర్ అవార్డు ప్రదానం చేశారు. చివరిగా భార్గవి, రాధ, శిరీష, రేణుకేస్వాన్, హరిష్మా, నూర్జహాన్ తదితరులను సన్మానించి ఉత్తమ మహిళా అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పి.రామచంద్రయ్య, పి.విశ్వనాథం, డా. శోభా పేరిందేవి, డి.శైలజ, డి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

భక్తిమార్గమే అన్నింటికి ఆచరణయోగ్యమైన మార్గం

చిక్కడపల్లి, మార్చి 29 ప్రభాతవార్త: భక్తిమార్గమే అన్నింటికి ఆచరణయోగ్యమైన మార్గం అని ప్రముఖ గాయనీమణులు ఎం.వి.రమణకుమారి, ఎంవి. సుబ్బలక్ష్మి అన్నారు. ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాగ్‌అంబర్‌పేటలోని శ్రీరామమందిరంలో భక్తిగీత విభావరి కార్యక్రమం జరిగింది. రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవాసంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి స్వరసారధ్యంలో నిర్వహించిన భక్తిగీత విభావరిలో గాయనీ గాయకులు తదితరులు భక్తిగీతాలాపన కనులపండువగా సాగింది. 'రామచంద్రుడీతడు..రఘువీరుడు, శ్రీసీతారాముల కళ్యాణం, అంతయునీవే హరిపుండరీకాక్ష, రాముడు-రాఘవుడు, జగదబిరాముడు, దేవదేవంభజే, రామయ్యతండ్రి ఓ రామయ్యతండ్రి తదితర రాముడుపై పాడిన భక్తిగీతాలు అందరిని ఆధ్యాత్మికసాగరంలో తేలియాడించాయి.

ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెగా జాబ్ మేళా

చిక్కడపల్లి, మార్చి 29 (ప్రభాతవార్త) : బాగ్‌లింగంపల్లి డా. బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళా ఘనంగా ముగిసింది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ డ్రైవ్‌లో టెక్ మహీంద్రా, క్రెడెన్సర్, కంట్రోల్ ఎస్ డేటాసెంటర్, ఐబీసీ టెక్నాలజీస్, ఐఎంసీ డిజిటల్, క్లౌడ్‌బాక్స్ 99, స్టార్ట్‌ఫీల్ సాఫ్ట్వేర్, ఏసీటీ, హెటెరో, టెలిపర్ఫార్మెన్స్ వంటి సుమారు 38 అగ్రశ్రేణి కంపెనీలు పాల్గొన్నాయి. డిగ్రీ, పీజీ ఎంబీఏ విద్యార్థుల ప్రతిభను ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా పరీక్షించి, ఉద్యోగాలకు ఎంపిక చేశారు. గత మూడు నెలలుగా కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించింది. పైథాన్ , క్లౌడ్ కంప్యూటింగ్, జావా స్క్రిప్ట్, సి, సి++ డిజిటల్ మార్కెటింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ (భాషా నైపుణ్యం) పై ప్రత్యేక దృష్టి సారించారు. . ఈ మేళాలో 500 మందికి పైగా అభ్యర్థులు హాజరుకాగా, ఎంపికైన విద్యార్థులు తమకు లభించిన ఈ అవకాశం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కాలేజీ సీఈఓ, డైరెక్టర్లు, డిగ్రీ, ఎంబీఏ కళాశాలల ప్రిన్సిపాల్స్ విజేతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమ విజయానికి తోడ్పడిన నిర్మాణ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఆహారప్యాకేట్లను పంపిణీ చేస్తున్న పలుస బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్

-నగర ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్

చిక్కడపల్లి, మార్చి 29 ప్రభాతవార్త: తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీవారి ఆలయం వీధిలో పార్టీ ప్రధానకార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుసబాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించే కార్యక్రమం జరిగింది. బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని నలుదిశలా చాటిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి వల్లే ఏపిలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పి.శివకృష్ణ, సాగర్, శంకర్‌గౌడ్, నాయుడు, గోపాల్, ఉదయ్‌కుమార్, శ్రీనివాస్, పుల్లయ్య, సాయి, అన్నపూర్ణ, వీణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం ఉత్తమ సంస్కృతి

చిక్కడపల్లి, మార్చి 29 (ప్రభాతవార్త) : ప్రతిభావంతులైన కళాకారులను గౌరవించడం, వారిని సత్కరించుకోవడం సమాజానికి ఉత్తమ సంస్కృతి అని ప్రముఖ రచయిత టి.వి. స్వామి పేర్కొన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళామారుతి కళా విధికలో మానస ఆర్ట్స్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి రఘుశ్రీ, ఐఎస్ఆర్ ఫ్రెండ్స్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టి.వి. స్వామి మాట్లాడుతూ.. కళాకారుల వల్లే సమాజంలో సంస్కృతీ సంప్రదాయాలు పరిఢవిల్లుతాయని, వారు జాతికి లభించిన వరమని కొనియాడారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ లలిత వాణి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఉగాది పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. పురస్కారాలు డాక్టర్ నర్మదారెడ్డి (ప్రముఖ పారిశ్రామికవేత్త), సద్గురు దామోదర్ బాబా (జ్యోతిష్య శాస్త్రం) , రమేష్ (శాస్త్రీయ నృత్యం, మిమిక్రీ ఆర్టిస్ట్), రాజ్ మురారి (దర్శకులు), కావ్య సుధ(ప్రముఖ రచయిత) ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కార్టూనిస్ట్ డాక్టర్ వడ్డీ నాగరాజ్, గాయకుడు ఐ.ఎస్.ఆర్, మానస థియేటర్స్ నిర్వాహకులు బండారుపల్లి రామచంద్రరావు పాల్గొని ప్రసంగించారు. సభా కార్యక్రమం అనంతరం సినీ గీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమానికి మానస కార్యదర్శి రఘుశ్రీ సమన్వయకర్తగా వ్యవహరించగా, సభకు సాయి బాబా కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సీతారాముల శోభాయాత్ర

చిక్కడపల్లి, మార్చి 29 (ప్రభాతవార్త): ఆధ్యాత్మిక శోభతో చిక్కడపల్లి పురవీధులు పులకించాయి. శ్రీరామ నామ స్మరణతో మారుమోగాయి. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాతిరి పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల దేవతామూర్తుల శోభాయాత్ర అత్యంత కన్నులపండువగా, భక్తిశ్రద్ధలతో సాగింది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుండి ప్రారంభమైన ఈ యాత్రకు భక్తులు బ్రహ్మరథం పట్టారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, భజన బృందాల కీర్తనల మధ్య సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఊరేగించారు. భక్తుల జయజయధ్వానాలు, జై శ్రీరామ్ నినాదాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. భక్తులు అడుగడుగునా దేవతామూర్తులకు హారతులు ఇచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, బీఆర్ఎస్ సీనియర్ నేత గోక నవీన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబేద్కర్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు

సైఫాబాద్, మార్చి 29 ప్రభాతవార్త:

రిజర్వేషన్‌ల ద్వారా లబ్ధిపొంది ఉన్నతస్థాయిలో ఉన్న కొంత మంది అధికారులు రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధానకార్యదర్శి కాకి మాధవరావు చెప్పారు. అంబేద్కర్ పిలుపునిచ్చిన పే బ్యాక్ టూ సొసైటీ నినాదాన్ని విస్మరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఎంప్లాయిస్ అండ్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో సింగరేణి మాజీ సిఎండి, చైర్మన్ బలరామ్‌కు జరిగిన పౌర సన్మానం, వీడ్కోల్ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎడారిలో ఒయాసిస్‌లాగా బలరామ్ తనకు కనిపించారని, సింగరేణి సంస్థ అభివృద్ధితోపాటు సమాజహితం కోసం ఎంతో కృషిచేశారని, మరొకవైపు జాతికోసం పాటుపడుతూనే సేవ చేస్తున్నారని ఆయన కొని యాడారు. బలరామ్ మాట్లాడుతూ 135 ఏళ్ళ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థకు ఛైర్మన్‌గా సేవలు అందించడం తనకు ఎంతో తృప్తికలిగించిందన్నారు. సింగరేణిలో తాను బాధ్యతలు చేపట్టిన తరువాత ఉత్పత్తిలోనూ, లాభాల్లో ఎంతో అభివృద్ధి సాధించడం జరిగిందన్నారు. సంస్థ ఉద్యోగుల, అధికా రుల సహాయంతోనే ఇది సాధ్యమైందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, డిసిఎం మల్లు భట్టి విక్రమార్కలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములునాయక్, తుమ్మల ప్రఫుల్ రామిరెడ్డి, గోలపల్లి దయానందరావు, సి.హెచ్. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలరామ్‌ను సత్కరిస్తున్న కాకి మాధవరావు

భజనలు, సంకీర్తనలు చేస్తున్న వేముల రామకృష్ణ తదితరులు

4వ తేదీన హిందూ సమ్మేళనం

హైదరాబాద్, మార్చి 29 ప్రభాతవార్త : రాజేంద్రనగర్‌లో వచ్చేనెల 4వ తేదీన హిందూ సమ్మేళనం నిర్వహించనున్నారు. భారీ ఎత్తున నిర్వహిస్తున్న ఈ సమ్మేళనం విజయవంతానికి నిర్వాహణ కమిటీ ఆదివారం కాలనీ పురవీధుల్లో భజనలు, సంకీర్తనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు పెండానయల రామకృష్ణ, బాలరాజు ముదిరాజ్, డాక్టర్ అమరేందర్, చిన్మయ, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు గడపగడపన తిరుగుతూ బొట్టుపెట్టి ఆహ్వానించారు. హిందువులను ఒక తాటిపైకి తెచ్చి సనాతన ధర్మం పరిరక్షణ కోసం భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక విలువలు అందించేందుకు హిందూ సమాజం ఐక్యంగా ముందుకుసాగాలన్న ధ్యేయంతో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామని నిర్వాహక కమిటీ ప్రతినిధి, బిసి విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ పేర్కొన్నారు. సమ్మేళనంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

బ్రహ్మణులకు రాయితీపై నిత్యావసర వస్తువులు

సైఫాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకునే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిత్యావసర వస్తువులపై రాయితీ సేవా కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నామని గ్లోబల్ బ్రహ్మిన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిప్రసాద్‌శర్మ తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి-మార్ట్ ఆధ్వర్యంలో నిర్మాణాత్మక సేవా-ఆధారిత కార్యక్రమం ద్వారా నిత్యావసర వస్తువులను రాయితీ ధంలకు కందిపప్పు, చక్కెర, గోల్డ్‌డ్రాఫ్ పొద్దుతిరుగుడు నూనె, గోధుమ పండి తదితర సరుకులను పంపిణీ చేస్తామన్నారు. మధ్య తరగతి బ్రాహ్మణ/లు ఈ పోర్టల్ ఇండియన్ బ్రాహ్మిన్స్.కం/ ఇన్‌డెక్స్.పిహెచ్‌పి/బిఆర్-ఈ-కార్ట్/ లేదా 9701609689లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హత కలిగిన మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాలకు మాత్రమే ఈ అవకాశం పరిమితమని, దరఖాస్తుల పరిశీలన అనంతరం అధికారికంగా అమోదించబడిన లబ్ధిదారులకు రాయితీపై సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. హైదరాబాద్ నగరంలో తొలి పైలట్ విజయవంతమైందని, ముఖ్యంగా గృహిణుల నుంచి సానుకూలంగా స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో బ్రాహ్మణ కుటుంబాలకు తొలిసారిగా మండలాల వారీ గా నిర్మాణాత్మక రాయితీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు.

అయ్యప్ప స్వామి మహాపడి పూజకు విరాళం

జీడిమెట్ల, మార్చి 29, ప్రభాతవార్త : శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి జన్మదిన మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమానికి శ్రీ మణికంఠ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జాలిగం రాకేష్‌ని ఆహ్వానించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన జాలిగం రాకేష్ వేడుకలు అంగరంగ వైభవంగా జరగాలని ఆకాంక్షి స్తూ తన వంతు సహాయంగా రూ.11,000 కమిటీ సభ్యులకు ఆదివారం అందజశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులతో అందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని సంకల్పించారు.

ప్రైమ్ పివిసి ఇంటీరియర్ స్టూడియో ప్రారంభం

జూబ్లీహిల్స్, మార్చి 29, ప్రభాతవార్త: ఉద్యోగాలు చేయాలనే ఆలోచనతో కాకుండా ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా యువత అభివృద్ధి చెందాలని కాంగ్రెస్‌నేత చిన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని కమలాపురి కాలనీలో రోహన్ ఆకుల ఏర్పాటు చేసిన ప్రైమ్ పీవీసీ ఇంటీరియర్ స్టూడియోను ఆయన ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం నేత మామిడి నర్సింగ్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధితో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలనే యువతకు ప్రభుత్వం పలు రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నదని ప్రభుత్వ పథకాలను, రుణాలను సద్వినియోగం చేసుకొని వృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. నిర్వాహకులు రోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం గృహ ఇంటీరియర్ విభాగంలో మన దేశం నుంచే కాకుండా ఇతర దేశాలకు చెందిన ఇంటీరియర్ మెటీరియల్‌కు విపరీతమైన ఆధరణ ఉన్నదని నగరవాసుల అభిరుచికి తగ్గట్టుగా సేవలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజక వర్గం ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ నేత కుంబాల గంగరాజు, ఆకుల రాజు, నాగేష్ సాగర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో అన్నదానం

కంటోన్మెంట్, మార్చి 29 ప్రభాతవార్త: మహావీర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కంటోన్మెంట్ బోర్డు జైన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొని పూజలు నిర్వహించి పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాహుల్, కాలనీ కార్యదర్శి వికాస్ కటారియా, ఉపాధ్యక్షులు ధర్మేందర్ జైన్ పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్ అభివృద్ధికి కృషి : అనంద్ బాబు

కంటోన్మెంట్, మార్చి 29 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోయిన్‌పల్లిలోని వ్యవసాయ మార్కెట్‌లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు సౌకర్యాలు మెరుగుపర్చడంతోపాటు చెత్త డంపింగ్‌యార్డును తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ చైర్మన్ ఆనంద్‌బాబు, కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంతాల అభివృద్ధికి యుద్ధప్రాతిపదికను చర్యలు తీసుకుంటున్నామన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్‌లో శనివారం ఈ నెల 28న ఎంపీ ఈటెల రాజేందర్ బోయిన్‌పల్లి మార్కెట్‌లో తలపెట్టిన ధర్నాలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్ బాబు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ దేవుడులతో పాటు సభ్యులు పాల్గొనలేదని అనంద్ బాబు స్పష్టం చేశారు.

నేడు కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

కంటోన్మెంట్, మార్చి 29 ప్రభాతవార్త: సికింద్రాబాద్, మారేడ్‌పల్లి కస్తూర్బాగాంధీ మహిళా పిజీ కళాశాలలో 2023..25 విద్యా సంవత్సరంలో ఎంబిఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 30న ఆదివారం కళాశాలలో ఎంబిఏ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహిస్తున్నామని ఎంబిఏ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ నీల గొల్లపూడి తెలిపారు. ఈ వేడుకలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త సుధాకర్ గండే, కళాశాల చైర్మన్ పి.నరోత్తం రెడ్డి, వైస్ చైర్మన్ ఎల్.మంజిత్ రెడ్డి, కార్యదర్శి మహ్మద్ ఫైముద్దీన్, సంయుక్త కార్యదర్శి జిఎం.రమేశ్, కోశాధికారి డి.సురేశ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీలు పాల్గొనున్నట్లు ఆమె తెలిపారు.

దానాల్లో కన్న అన్నదానం గొప్పది : నందికంటి రవి

అడ్డగుట్ట, మార్చి 29 ప్రభాతవార్త:

అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, శ్రీపాండురంగ వితలేశ్వరస్వామి ధర్మకర్త నందికంటి రవి తెలిపారు. శ్రీరామ నవమి మహోత్సవాలను పుర స్కరించుకొని కంటోన్మెంట్ రెజిమెంటల్ బజార్‌లో శ్రీషిరిడి సాయిబాబా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్ర మాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ శ్రీబాలగణ పతి ఫ్రెండ్స్ అర్గనైజర్లు జ్ఞాని, వాసు, అశోక్, శేఖర్, సతీష్, సాయి ప్రసాద్, రాజు, సందీప్ పాల్గొన్నారు.

యెల్లంబండలో చలివేంద్రం ఏర్పాటు

మూసాపేట్, మార్చి 29, ప్రభాతవార్త : యెల్లంబండలో ఎండ తీవ్రత మధ్య ప్రజలకు ఉపశమనం కలిగించాలనే సంకల్పంతో డా. నరేష్ కొరదల అభిమానులు, నరేష్ యువ సైన్యం సభ్యులు సేవా దృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని నరేష్ కొరదల ప్రారంభించి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం కేవలం బాధ్యత మాత్రమే కాదు, అది మన జీవిత ధర్మం. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మండుతున్న ఎండలో ప్రజలకు చల్లని ఉపశమనం కలిగించే ఈ చలివేంద్రం ఏర్పాటు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు. ఎండకాలంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి నిజమైన ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

బోనాల ఉత్సవాలలో పాల్గొన్న బండి రమేష్

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

బోనాల పండుగ : బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 29, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజక వర్గం పరిధిలోని మూసాపేట్ రజక సంఘం ఆహ్వానం మేరకు ఈదమ్మ, శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగ బండి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ఈకార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, తూము ఎల్లారావు, రాజు, తూము సంతోష్ కుమార్, సప్పిడి భాస్కర్, అమీర్, బుచ్చిబాబు, రజక సంఘ నాయకులు నోముల యాదగిరి, నోముల స్వామి నరేష్, సత్యానారాయణ, తోట మల్లేష్ స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ దేవాలయ పునరుద్ధరణకు కృషి

దేవాలయం పునఃనిర్మాణానికి సమావేశమైన కమిటీ సభ్యులు

పేట్‌బషీరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త : 286 కుతుబుల్లాపూర్ డివిజన్ పరిధిలోని జైరాంనగర్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంటి మల్లేష్ మాజీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కృష్ణవేణి, సరోజనమ్మ, బాలమణి, బి.రేఖ, రేవతి, బి.వెంకటేష్, ఉపేందర్, నరేందర్, నర్సింగ్, ఆంజనేయులు, యాదగిరి, శంకర్, కృష్ణ, సంజయ్‌కుమార్, సందీప్ ఆధ్వర్యంలో కట్టమైసమ్మ దేవాలయం పునర్ నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులతో కలసి కుంట సిద్దిరాములు సొంత జెసిబి సహాయంతో, సొంత ఖర్చులతో శుభ్రం చేశారు. ఆలయ నిర్మాణం కోసం సొంత నిధులు ఖర్చుచేసి నాలుగు పిల్లర్లు నిర్మించి ఆలయ అభివృద్ధి సహాయంచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బచ్చ జ్ఞానేశ్వర్ సృజన్ పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో అసంపూర్తి రోడ్డు పనులపై ఆందోళన

స్పందించిన మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి

అంసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న విజయారెడ్డి

జూబ్లీహిల్స్, మార్చి 29, ప్రభాతవార్త: బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ సాయిబాబా ఆలయం ప్రధాన రహదారిలో కొన్ని నెలలుగా రోడ్డు తవ్వి వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానికులు టీపీసీసీ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పి.విజయారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆమె జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ ఎస్ఈ విజయకుమార్‌తో మాట్లాడి తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు రెండురోజుల్లో పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణ, ప్రెసిడెంట్ బాల్ నర్సింగ్, పి.సత్యనారాయణ, బంజారాహిల్స్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ధనరాజ్‌రాథోడ్, బస్తీ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ నూతన ఆలయ కమిటీ


శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం నూతన ఆలయ కమిటీ

నాంపల్లి, మార్చి 29 ప్రభాతవార్త : భరత్‌నగర్ శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయం నూతన ఆలయ కమిటీ ఎన్నిక ఈరోజు ఉదయం జరిగింది. రామాంతపూర్ భరత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా లక్ష్మన్న, రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆలయ కమిటీ అధ్యక్షుడుగా ఎస్.రామిరెడ్డి, ఉపాధ్యక్షుడుగా ఎ.చంద్రపాల్, ప్రధానకార్యదర్శి రాపోలు శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆకుల రవికుమార్, సహకార్యదర్శిగా ఎం.రమేష్, కోశాధికారిగా బి.సుధాకర్‌రావు, సలహాదారులుగా బి.నాగిరెడ్డి సత్యనారాయణ గౌడ్, పి.జానయ్యగౌడ్, టి.అరవిందస్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కె.బాల్‌రెడ్డి, ఇ.సీతయ్య, ఎ.రాముయాదవ్, బి.కిషోర్, ఎం.రవి, కె.రామ్ ప్రసాద్, ఆర్.వెంకట రమణారావు, యు.సిద్ధయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారానికే పాదయాత్రలు.

యూసుఫ్‌గూడ మార్చి 29 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించే దిశగా బస్తీలలో పాదయాత్రలు నిర్వహించటం జరుగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ అన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివ బస్తీలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. పెద్ద ఎత్తున బస్తీ వాసులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బస్తీలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పగలు రాత్రి తేడా లేకుండా కొంత మంది రౌడీ మూకలు గంజాయి, మద్యం తాగి శాంతి భద్రతల సమస్యలను సృష్టిస్తున్నారన్నారు. అంతేకాకుండా వ్యర్థాలను అక్కడ కుప్పలు కుప్పలుగా పడవేయడంతో పారుశుధ్య సమస్య అధికంగా ఉందని రైల్వే స్టేషన్ వరకు బోరబండ నుంచి ఆర్టీసీ బస్సులు వచ్చేలా చూడాలని స్థానికులు కోరారు. స్థానికంగా నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సమస్యలన్నింటినీ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, శివరాజ్ గౌడ్, నాగరాజు, సత్యనారాయణ, మన్సూర్, బర్కత్ అలీ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో ఉచిత వైద్య శిబిరం

జూబ్లీహిల్స్, మార్చి 29, ప్రభాతవార్త: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11లోని ఉదయ్ నగర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పి. విజయారెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఆరోగ్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు జనరల్,ఆర్థోపెడిక్, గైనకాలజీ విభాగాలకు చెందిన వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు.అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

పాతబస్తీలో భారీ అగ్ని ప్రమాదం

రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు షాపులు దగ్ధం... టిజిఎస్‌పిటిసిఎల్‌కు ఇరవై లక్షల రూపాయల వరకు నష్టం

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పక్కన దగ్ధమౌతున్న షాపులు

చార్మినార్, మార్చి 29 ప్రభాతవార్త : నయాపూల్ దర్వాజ వద్ద ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు షాపులతో పాటు టిజిఎస్‌పిటిసిఎల్‌కు చెందిన 250 కెవి,100 కెవిల సామర్థ్యంగల రెండు విద్యుత్ ట్రాన్‌ఫార్మర్లు కాలిపోయాయి. విద్యుత్ సంస్థకు దాదాపు ఇరవై లక్షల రూపాయలు వరకు నష్టం జరిగింది. మొగల్‌పుర ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పివేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది.చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు కథనం ప్రకారం... నయాపూల్ శీతల మాత మందిరం సమీపంలో టిజిఎస్‌పిటిసిఎల్‌కు చెందిన 250 కెవి.100 కెవి సామర్థ్యంగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లను ఆనుకుని జూస్ షాపు,గాజుల పరికరాలు విక్రయించే డబ్బా ఉంది. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఆనుకుని ఉన్న డబ్బాలు నుంచి మంటలు చెలరేగాయి.మంటలు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు కింద ఉన్న చెత్తాకు అంటుకుని ట్రాన్స్‌ఫార్మర్లకు అంటు కున్నాయి. మంటలు పెద్దఎత్తున ఎగిసి పడ్డాయి. మొగల్‌పుర ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పివేశాయి. దీంతో పెద్దప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంలో రెండు షాపులు, రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. టిజిఎస్‌పిటిసిఎల్‌కు దాదాపు ఇరవై లక్షల రూపాయలు వరకు నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం తెలియవలసి ఉంది. కాగా టిజిఎస్‌పిటిసిఎల్ చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్, చార్మినార్ ఏడిఈ సయ్యద్ మక్సూద్, చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్,చార్మినార్ ఏఈ మహ్మద్ నసీర్‌లు సంఘటన కాలి పోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.దాదాపు తొమ్మిది గంటలు తర్వాత విద్యుత్‌ను పునరుద్ధరించారు.

జ్యోతినివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీరాములు, ఎ.శ్రీనివాస్‌రావు

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఒయు మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. శ్రీరాములు

హైదరాబాద్, మార్చి 29 (ప్రభాతవార్త): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు అన్నారు. ఆదివారం బర్కత్‌పుర, నారాయణగూడ, దిల్‌సుఖ్ నగర్ అవంతి డిగ్రీ పీజీ కళాశాలల నూతన విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుక ఆరంభ్ 2026 ది బిగినింగ్ ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ శ్రీరాములు హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. 10 మంది విద్యార్థులతో ప్రారంభమైన అవంతి విద్యా సంస్థలు, నేడు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 10 శాతం విద్యార్థుల బలాన్ని కలిగి ఉండటం అభినందనీయమన్నారు. సంస్థ నిర్వాహకుల నిబద్ధత, దూరదృష్టి వల్లే ఇది సాధ్యమైందని కొనియాడారు. మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తక జ్ఞానం మాత్రమే సరిపోదని, విద్యార్థులు తమలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలలో ప్రత్యేకంగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని, ఇందులో కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ అంశాలు మరియు ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఎం. వెంకట్ దాస్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

కంటోన్మెంట్ ప్రాంతాన్ని ఎంఎంసిలో కలపడం సరైంది కాదు : గజ్జెల నాగేశ్

కంటోన్మెంట్,మార్చి 28 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ప్రాంతాన్నీ జీహెచ్ఎంసిలో విలీనం చేయాలని ప్రజలు కోరుకుంటుంటే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం సిగ్గుచేటని తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ తెలిపారు. ఆదివారం బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంతాన్నీ జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేసిన దీక్షకు స్వాగతం పలుకుతున్నామన్నారు. ఒకపక్క ప్రభుత్వంలో విలీనం జరిగిందని మల్కాజిగిరి కార్పొరేషన్ విలీనంలోచేస్తామని ప్రకటించడం సరైంది కాదన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాలకు ప్రత్యేక చరిత్ర కలిగి ఉందన్నారు. సికింద్రాబాద్, కంటోన్మెంట్‌ల చరిత్రను రూపు మాపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. చరిత్ర కలిగిన సికింద్రాబాద్‌ను విడదీయకూడదని మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్ ఇటీవల ఉద్యమాలు చేపట్టడం జరిగిందన్నారు. కంటోన్మెంట్ ప్రజల మనోబావాలను దెబ్బతీయకుండా సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బిఆర్ఎస్ నేతలు జంగాల మురళీ యాదవ్, సత్య నారాయణ గౌడ్,కనకయ్య, అక్తర్, నిత్య, ఆర్యాన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల నాగేశ్

కావూరి వెంకటేష్‌ను సన్మానించిన కార్యకర్తలు

తెలంగాణ జాగృతి నేత కావూరి వెంకటేష్‌కు సన్మానం

కార్వాన్, మార్చి 29(ప్రభాతవార్త) : తెలంగాణ జాగృతి కార్వాన్ నియోజకవర్గం ఇంచార్జ్ నాయకులు కావూరి వెంకటేష్ కార్యకర్తల చేతుల మీదుగా ఘన సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా కావూరి వెంకటేష్ మాట్లాడుతూ, కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ నేపథ్యంలో మహిళల అభివృద్ధికి, యువత ఉపాధికి అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.వివిధ వర్గాల నుండి మహిళలు,యువకులు తెలంగాణ జాగృతిలో త్వరలో భారీగా చేరికలు ఉంటాయని పేర్కొన్నారు.కల్వకుంట్ల కవిత గారి కొత్త పార్టీలో అవినీతి లేని కొత్తతరానికి ప్రాధాన్యత ఉంటోందని కావూరి తెలిపారు.

హిందూ సమ్మేళన నిర్వహణ నూతన కమిటీ

నూతన కమిటీలో దేవర శ్రీనివాస్, బల్వీర్ సింగ్,అనిల్ కుమార్

కార్వాన్, మార్చి 29 (ప్రభాతవార్త) : భాగ్యనగరం, కార్వాన్‌లో హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ప్రతిబస్తీలో హిందూ సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని కమిటీ సలహాదారు దేవర శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా రామ్‌సింగ్ పుర బస్తీలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా కె.అనిల్‌కుమార్ కుమ్మరి, కార్యదర్శిగా ఎం.సతీష్‌సింగ్, కోశాధికారిగా ఆటి పాముల నర్సింగ్‌రావు, కమిటీ సలహాదారులుగా దేవర శ్రీనివాస్, ఎస్.బల్వీర్ సింగ్,ఉపాధ్యక్షులుగా పి.సుజనా, కార్యనిర్వాహకులుగా ఆటిపాముల మంజుల, కార్యనిర్వహణ కార్యదర్శిగా బోడి లక్ష్మి మలను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బద్రి యాదవ్

అడ్డగుట్ట, మార్చి 29 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని సీనియర్ కాంగ్రెస్ నేత బద్రి నాథ్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన ఈస్ట్ మారేడ్‌పల్లి ముత్యాలమ్మ టెంపుల్ సిరిపురి కాలనీలో పాదయాత్రలు జరిపి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే శ్రీగణేష్ సహకారంతో సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, రాములు, అశోక్,మధు యాదవ్, అంజయ్య పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ పోసచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

సంజీవరెడ్డినగర్, మార్చి 29, ప్రభాతవార్త: బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలోని మూలవిరాట్ అమ్మవారిని ఆదివారం వివిధ రకాల పుష్పాలతో, తులసి ఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మరిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శ నార్థం వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, సిబ్బంది చూసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సాయి బాబగౌడ్ మాట్లాడుతూ అమ్మవారి చల్లని చూపులు అందరిపై ఉండాలని అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం సర్దుమణిగి ప్రశాంతవాతావరణం నెలకొనాలని అమ్మవారినికోరుకున్నట్లు ఆయన తెలిపారు.

బడ్జెట్‌లో ఎస్సీలకు ఎక్కువ నిధులు కేటాయించాలి

సైఫాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీలకు స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులను తగ్గించి కేటాయింపులు చేసి సవతితల్లి ప్రేమచూపుతుందని మాల సంక్షేమ సంఘం ఆరోపించింది. తక్షణమే బడ్జెట్ సమావేశాల్లోనే నిధుల సంఖ్యను పెంచాలని సంఘం డిమాండ్ చేసింది. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు బత్తుల రాంప్రసాద్, ఉత్తం శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఏడాది బడ్జెట్ సమావేశాల్లో చాలా తక్కువగా నిధులు కేటాయించి, ఈ ఆర్థిక సంవత్సరం 20 శాతం నిధులు తగ్గించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ స్పెషల్ డవలెప్‌మెంట్ ఫండ్ కోసం, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సవరణ కోసం రెండు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి, చర్చించి తగున్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నగరంలో పెరిగిన కాలుష్యం, ట్రాఫిక్‌ను తగ్గించాలి

సైఫాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలను అరికట్టడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని బంగారు తెలంగాణ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ అమానుల్లాఖాన్ ఆరోపించారు. నెలరోజుల్లోగా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్య సమస్యలు పరిష్కారం కావాలంటే కార్లకు కాళ్లెం వేయకతప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వహన్‌పోర్టల్ అమలు చేయాలని కోరారు. ఇది అమలు చేయడం వల్ల వాహనాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని, అలాగే కార్లలో ముగ్గురికంటే తక్కువ మంది ప్రయాణం చేస్తే ఆ కార్లను నిషేధించాలని కోరారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ వల్ల ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నదని, కాని ప్రభుత్వం రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. తక్షణమే కాలుష్య, ట్రాఫిక్ నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ముస్తాక్‌సిద్ధికి, మహ్మద్ అలీల్‌ఉల్లా, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 29, ప్రభాతవార్త : చలివేంద్రాలు ప్రజల దాహాన్ని తీర్చడానికి దోహదపడతాయని పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సుమిత్రనగర్‌లో చైతన్యనగర్ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి అరికెపూడి గాంధీ ప్రారంభించారు. అనంతరం చల్లని మజ్జిగను కాలనీ వాసులకు, బాటసారులకు అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయినేనీ చంద్రకాంత్‌రావు, నర్సయ్య, బాలరాజు, నర్సింహచారి, వేణు, కృష్ణంరాజు, యాదగిరి, నాగచారి, శ్రీను, శ్యామ్‌ప్రసాద్, విజయ్ కుమార్, కృష్ణరావు, సంతోష్, వెంకటేష్, అనిల్‌కుమార్, మల్లేష్, నవీన్ చారి, అనిల్‌కుమార్, బాలకృష్ణ, లక్ష్మణ్, సాయి, సాయికుమార్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

దుండిగల్, మార్చి 29, ప్రభాతవార్త : అనారోగ్యంతో బాధపడేవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక ఆపన్న హస్తమని, ఆపదలో ఉన్నవారు సీఎంఆర్ఎఫ్‌ని సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ సూచించారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ శంభీపూర్‌లోని కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన రూ.3,65,500 విలువగల 11 సీఎంఆర్ఎఫ్ చెక్కులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జక్కుల శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ పాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి క్రిష్ణ, పాక్స్ డైరెక్టర్ ఈ శ్రీనివాస్, నిజాంపేట్ సర్కిల్ యూత్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌గౌడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఉచిత సమగ్ర ఆరోగ్య శిబిరం

జూబ్లీహిల్స్, మార్చి 29,ప్రభాతవార్త: పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో తెలంగాణ ప్రభుత్వ హెల్త్‌మిషన్ 100లో భాగంగా వృద్ధుల కోసం ఉచిత సమగ్ర వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. నిమ్స్ జెరియాట్రిక్ మెడిసిన్ విభాగం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించనున్నారు. వృద్ధుల శారీరక, మానసిక, కార్యాచరణ ఆరోగ్యాన్ని సమగ్రంగా అంచనా వేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. శిబిరంలో వృద్ధుల్లో సాధారణంగాకనిపించే వ్యాధులను గుర్తించేందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ), రాండమ్ బ్లడ్ షుగర్, సీరమ్ క్రియాటినిన్, ఈసీజీ వంటి పలు పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైతే ఫిజియోథెరపీ సేవలు, ప్రొఫెషనల్ కౌన్సెలింగ్ కూడా ఉచితంగా అందిస్తామన్నారు. 60 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిమ్స్ డైరెక్టర్ కోరారు. ఈ శిబిరం మార్చి 31న నిమ్స్ పాత భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న నెఫ్రాలజీ సెమినార్ హాల్‌లో నిర్వహించబడుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందన్నారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు.

7 నుంచి బధిరుల మహిళా టి20 క్రికెట్ టోర్నీ

చిక్కడపల్లి, మార్చి 29(ప్రభాతవార్త): తెలంగాణ స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది డీఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టీ చిరంజీవి, వల్లభనేని ప్రసాద్ ఆదివారం ఎన్నికయ్యారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు టి.చిరంజీవి,వల్లభనేని ప్రసాద్ మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌లు ఎందులోనూ తక్కువకాదని ఈ పోటీలలో బధిరులు నిరూపించారని అన్నారు.ఆసియా క్రికెట్ టోర్నమెంట్ లను కూడా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇందులో భాగంగానే టి20 మహిళా క్రికెట్ టోర్నమెంట్లను ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా నూతన కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా వికే జయప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా షకీల్ అహ్మద్ ఖాన్, కోశాధికారిగా మహమ్మద్ ఇమ్రాన్, కార్యవర్గ సభ్యులుగా కే రఘుమోహన్, సయ్యద్ అహ్మదుద్దీన్, ఈవెంట్ మేనేజర్ గా వల్లభనేని భారతి, నిర్వాహకురాలిగా రేవతి, సలహాదారులుగా గోవింద్ నియమితులయ్యారు.

న్యాయం జరిగేలా చూడండి

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి అమీన్‌పూర్ బాధితుల వినతి



అంజిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బాధితులు

హైదరాబాద్, మార్చి 29,ప్రభాతవార్త: అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిసరాల్లో డ్రైనేజీ నీటి ప్రవాహం పెరగడంతో చెరువు విస్తీర్ణం విపరీతంగా పెరిగి, సుమారు 3000 కుటుంబాలకు చెందిన ప్లాట్లు ముంపుకు గురవుతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విష్ణుప్రియానగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, సమస్యపై ప్రభుత్వంతో చర్చించి ప్లాట్ యజమానులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 1998లో ప్రైవేట్ పట్టభూములుగా కొనుగోలు చేసిన ప్లాట్లు అప్పట్లో చెరువు నుండి దూరంగా ఉండగా, ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని యజమానులు తెలిపారు.చెరువులో నీటి నియంత్రణకు ఉపయోగించే తూములు పనిచేయకపోవడం, అవుట్‌ఫ్లో మార్గాలు మూసుకుపోవడం ప్రధాన కారణాలని పేర్కొన్నారు.చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా ట్యాంక్‌బండ్ ఎత్తు పెరగడంతో నీటి విడుదల వ్యవస్థ దెబ్బతిందని, వర్షపాతం లేకపోయినా పట్టణ ప్రాంతాల డ్రైనేజీ నీరు, సమీప పరిశ్రమల వ్యర్థాలు చెరువులోకి చేరుతున్నాయని ఆరోపించారు. దీంతో నీటి మట్టం రోజురోజుకు పెరిగి ప్లాట్లు ముంపుకు గురవుతున్నాయని వివరించారు.దస్తావేజుల ప్రకారం చెరువు విస్తీర్ణం 93.15 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం అది సుమారు 454 ఎకరాలకు పెరిగినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. ప్రమీల తెలిపారు. సమస్యపై పలుమార్లు నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖలను సంప్రదించినప్పటికీ స్పందన లభించలేదని విమర్శించారు. డ్రైనేజీ ప్రవాహాన్ని అరికట్టి, తూములు మరియు అవుట్‌ఫ్లో మార్గాలను పునరుద్ధరించి నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని చెరువు ముంపు విస్తీర్ణాన్ని పునఃసమీక్షించి, ప్లాట్లను ముంపు నుంచి రక్షించాలని ప్లాట్ యజమానులు విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM VIII ADDL JUDICAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL MALKAJGIRI DISTRICT AT MEDCHAL
O.S.No.166 of 2026

Between:-
Karumanchi Jansi Rani & Ors ...Plaintiffs
AND
The Tahsildar, Bachupally Mandal, Medchal Malkajgiri & Anr ...Defendants

To
All Concerned,
Whereas my clients **1) Karumanchi Jansi Rani**, W/o: Late Karumanch Bhaskara Rao, Aged 43 years, Occu: House Wife, **2) Karumanchi Bhavana**, D/o: Late Karumchani Bhaskara Rao, aged about 19 years, Occu: Student, 3) Karumanchi Akash Babu, S/o: Late Karumachi Bhaskara Rao, Aged about 20 years, Occu: Student, **4) Karumanchi Pavan Kumar**, S/o: Late Karumachi Bhaskara Rao, Aged about 15 years, Occu: Student, being minor rep by his natural mother i.e. Plaintiff No.1, All are R/o: H.No.2-62/5/60/3, Indranna Colony, Rajeev Gruhakalpa, Nizampet, Kukatpally, MM District, has filed the above case for Declaration of legal heir to Late Karumanchi Bhsakara Rao.
The above case is posted on **20.04.2026.** If anyone has objections in declaring my above said clients as legal heirs to Late Karumanchi Bhsakara Rao, you are hereby requested to appear on 20.04.2026 before Hon'ble I Additional Junior Civil Judge cum VIII Addl Judicial Magistrate of First Class, Medchal Malakjgiri District at Medchal, at 10.30 am., in person or by an Advocate. In failure, the matter will be decided exparte in your absence.

By order of the court.
Karra V V S N Murthy
Advocate
402, 4 th Floor, Orion Plaza, Road No.3, Banjara Hills, Hyderabad-32. **Cell No. 9441670405**
Email: karraassociates2020@gmail.com

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE MEDCHAL MALKAJGIRI DISTRICT AT KUSHAIGUDA
EA. No.34 OF 2025
IN
E.P.S.R.No. 5300 OF 2025

Between:-
M/s. Shasta Freight Services Pvt Ltd ...Petitioner / Decree Holder
AND
M/s. DSN LABS ...Respondent / Judgment Debtor

To
M/s. DSN LABS
Plot No.9/A, Road No.9, IDA Nacharm, Hyderabad, Telangana - 500076
Whereas my client **M/s. Shasta Freight Services Pvt Ltd** has filed the above Execution Application Order XXI Rule 41 R/W Sec 151 of C.P.C for execution of MSME Award dated 21.06.2024 in Case No. A/936/MSEFC/2022.
The above case is posted on **13.04.2026.** You are hereby directed to appear in the Court of The Hon'ble Principal District & Sessions Judge, Medchal Malkajgiri District at Kushaiguda in person or by an advocate duly instructed on 13.04.2026 at 10-30 am to show cause against the application. In failure to attend, the matter will be decided exparte in your absence.

By order of the court.
Karra V V S N Murthy
Advocate
402, 4 th Floor, Orion Plaza, Road No.3, Banjara Hills, Hyderabad-32.
Cell No. 9441670405
Email: karraassociates2020@gmail.com

వైభవంగా ముగిసిన శ్రీరాములగుట్ట బ్రహ్మోత్సవాలు

శామీర్‌పేట, మార్చి 29, ప్రభాతవార్త : లక్ష్మాపూర్ గ్రామంలోని శ్రీరాములగుట్ట బ్రహ్మోత్సవాలు ఆదివారం మధ్యాహ్నంతో ముగిశాయి. మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని శ్రీరాములగుట్ట బ్రహ్మోత్సవాలు ఐదు రోజులు పాటు కొనసాగి ఆదివారం ముగిశాయి. ఈ నెల 27న శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చివరి రోజు శ్రీరాములగుట్ట దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శ్రీసీతారామచంద్రస్వామి లక్ష్మణ సహిత హనుమాన్ ఉత్సవ మూర్తులను శ్రీరాములగుట్ట నుంచి కొట్యాల చెలిమె వరకు భజనలతో ఊరేగింపుగా వెళ్లగా కొట్యాల చెలిమె వద్ద నాగరాజు పూజారి ఉత్సవ మూర్తులకు చక్రస్నానాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తరువాత శ్రీరాములుగుట్ట నందు ధ్వజా అవరోహణ చేయటంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ ఎల్లగౌని చిత్తయ్యగౌడ్, గ్రామపెద్దలు చిన్నలచ్చ శ్రీనివాస్‌గౌడ్, ఆలయ వైస్‌చైర్మన్ మాడబోయిన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సింగం పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి తోట పరమేశ్, భక్తులు సింగం నర్సింగనరావు, గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్తా, బందెల ప్రభాకర్, చాడ శావుకారి, సింగం భాస్కర్, హరీశ్, ఓజాల శ్రీశైలం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు

ఫాంహౌస్‌ల నిర్వాహకులకు ఎక్సైజ్ సిఐ శ్రీలత హెచ్చరిక

చేవెళ్ల, మార్చి 29, ప్రభాతవార్త: చేవెళ్ల డివిజన్ పరిధిలోని ఫాంహౌస్‌లలో చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ఎక్సైజ్ సిఐ శ్రీలత హెచ్చరించారు. ఆదివారం ఆమె చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఫాంహౌస్‌లలో అనుమతి లేకుండా మద్యం సేవించడం, ఎన్‌డిపిఎల్, ఐఎంఎల్ అక్రమ నిల్వలు, నిషేధిత మాదక ద్రవ్యాల వినియోగం సంఘటనలు వెలుగులోకి వచ్చాయన్నారు. అక్రమంగా మద్యం సేవించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకున్నామన్నారు. డ్రగ్స్‌ను సేవించిన వారిపై కూడ కేసులు నమోదు చేసి జైలుకు పంపించామన్నారు. అనుమతి లేకుండా ఫాంహౌస్‌లు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం పూర్తిగా విషేధించామని తెలిపారు. ఎక్సైజ్ నిబంధనలు ఉల్లఘించిన వారిని సహించేది లేదన్నారు. ఇతర రాష్ట్రాలైన గోవా, హర్యానా తదితర రాష్ట్రాల నుండి అక్రమంగా మద్యం తీసుకురావడం, ఆర్మీ లిక్కర్, ఎయిర్‌పోర్ట్ డ్యూటీ లిక్కర్‌ను అనుమతి లేకుండా నిల్వ చేయడం, విక్రయించడం చట్టవిరుద్ధమన్నారు. ప్రజలు అక్రమ మద్యానికి, డ్రగ్స్‌కు బానిసలు కావద్దని విజ్ఞప్తిచేశారు. డ్రగ్స్‌ను ఎవరైన విక్రయిస్తున్నారని తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు పనులు నిలిపివేశారని

రాస్తారోకో

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఆగ్రహం

పోలీసుల హామీతో శాంతించిన గ్రామస్తులు

ధారూర్, మార్చి 29, ప్రభాతవార్త : ధారూర్ మండల పరిధిలోని కెరెల్లీ గ్రామ శివారులో సిసి రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం గ్రామస్థులు తాండూర్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై భారీ ధర్నా చేపట్టారు. గ్రామ అంచున రోడ్డు కోసం నెలల క్రితం గుంతలు తవ్వి, కంకర వేసి వదిలేయడంతో వాహనాల రాకపోకల వల్ల విపరీతమైన దుమ్ము, ధూళి రేగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఇళ్లలోకి ధూళి చేరుతోందని, శ్వాసకోశ ఇబ్బందులతో చిన్నపిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారని వారు ఆరోపించారు. ఈ సమస్యపై కాంట్రాక్టర్లకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో విసుగు చెంది రోడ్డుపై బైఠాయించినట్లు తెలిపారు.

గ్రామస్థుల ఆందోళనతో ప్రధాన రహదారిపై వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించి ధర్నా విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఆరు పదులు దాటినా.. వాకింగ్

లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్‌లో చీఫ్ విప్ హవా

100 మీటర్ల స్పీడ్ వాకింగ్ పోటీలో ద్వితీయ స్థానం

కుర్రాళ్లకు ధీటుగా వేగంగా అడుగులు

చివరి క్షణం వరకు పట్టు వదలకుండా పోటీ ఇచ్చిన మహేందర్‌రెడ్డి

ఆర్చరీలో గురి తప్పని ఏకాగ్రత

4 రౌండ్లలో 25 పాయింట్లతో 4వ స్థానం

లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి మహేందర్ రెడ్డి డబుల్ ధమాకా సాధించారు. 100 మీటర్ల వాకింగ్‌లో 2వ స్థానం, ఆర్చరీలో 4 రౌండ్లకు గాను 25 పాయింట్లు సాధించి 4వ స్థానంలో నిలిచిన మహేందర్ రెడ్డికి వయసు పెరిగినా.. గురి మాత్రం తప్పలేదు!

తాండూరు, మార్చి 29, ప్రభాతవార్త : రాజకీయ రణక్షేత్రంలో అజేయుడిగా పేరున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి మహేందర్ రెడ్డి క్రీడా మైదానంలోనూ తన సత్తా చాటారు. లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026లో భాగంగా ఆదివారం నిర్వహించిన 100 మీటర్ల స్పీడ్ వాకింగ్ పోటీలో ఆయన రెండో స్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. మహేందర్ రెడ్డికి క్రీడలు కొత్తేమీ కాదు. గతంలో విద్యార్థి దశలో, యువజన నాయకుడిగా ఉన్నప్పుడు ఆయన క్రీడల్లో చురుగ్గా పాలొనే వారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిన ట్రాక్ రికార్డ్ ఆయన సొంతం. అదే ఉత్సాహాన్ని నేడు ఎల్బీ స్టేడియంలో ప్రదర్శించారు. 60 ఏళ్లు దాటిన వయసులో కూడా కుర్రాళ్లకు ధీటుగా వేగంగా అడుగులు వేస్తూ ఫినిషింగ్ లైన్ చేరుకోవడం విశేషం. నిత్యం ప్రజా సేవలో, రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ, నేడు ఆయన ప్రదర్శించిన వేగం చూసి తోటి ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు ఆశ్చర్యపోయారు. తనలోని పాత క్రీడాకారుడిని మరోసారి నిరూపిస్తూ, యువ ఎమ్మెల్యేలకు గట్టి పోటీని ఇచ్చారు. 100 మీటర్ల నడక పోటీలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మొదటి స్థానంలో నిలవగా, మహేందర్ రెడ్డి సెకనుల వ్యవధిలో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. ఫినిషింగ్ లైన్ వరకు పట్టువదలకుండా ఆయన వేసిన అడుగులు స్టేడియంలో అందరినీ ఆకట్టుకున్నాయి. గెలుపోటముల కంటే కూడా క్రీడా స్ఫూర్తిని చాటడమే లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రముఖుల ప్రశంసలు

ప్రభుత్వ విప్ హోదాలో ఉంటూ, వయసును లెక్కచేయకుండా క్రీడల్లో పాల్గొన్న మహేందర్ రెడ్డిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పలువురు మంత్రులు, శాసన సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. శనివారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ క్రీడలను ప్రారంభించారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి వివిధ విభాగాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోటీడ్డారు. క్రీడలతో పాటు రవీంద్ర భారతిలో ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాజకీయాల్లో బిజీగా ఉండే ప్రజాప్రతినిధులకు మానసిక ఉల్లాసాన్ని అందించడానికి, పార్టీలకు అతీతంగా స్నేహభావాన్ని పెంపొందించడానికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం నిర్వహిస్తున్న తొలి స్పోర్ట్స్ మీట్ ఇదే కావడం విశేషం.

మరోవైపు ఆర్చరీలో బాణాలను సంధిస్తూ తనలోని అసలైన క్రీడాకారుడిని ఆవిష్కరించారు. శారీరక శ్రమతో కూడిన వాకింగ్ పోటీల తర్వాత, మానసిక ఏకాగ్రతకు పరీక్షగా నిలిచే ఆర్చరీ పోటీల్లోనూ మహేందర్ రెడ్డి పాల్గొని అందరినీ ఆశ్చర్యపరిచారు. మొత్తం 4 రౌండ్లలో జరిగిన ఈ పోటీలో ఆయన అద్భుతమైన ఏకాగ్రతతో 25 పాయింట్లు సాధించారు. ఎంతో అనుభవం ఉన్న వారు పాల్గొన్న ఈ విభాగంలో ఆయన 4వ స్థానంలో నిలిచి తృటిలో మెడల్ అవకాశాన్ని కోల్పోయినప్పటికీ, ఆయన చూపిన గురి చూసి తోటి ఎమ్మెల్యేలు ప్రశంసల వర్షం కురిపించారు.

వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

షాద్‌నగర్ టౌన్, మార్చి 29, ప్రభాతవార్త : వేసవికాలంలో షాద్‌నగర్ పట్టణానికి తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నామని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు. ఇందులో భాగంగా మిషన్ భగీరథ జలాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. నియోజకవర్గంలో కమ్మదనం గ్రామంలో గల మిషన్ భగీరథ సంపు హౌజ్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. సాంకేతిక సమస్యలతో ఆటంకం ఏర్పడినా ప్రత్యామ్నాయ ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెంటయ్య, మున్సిపల్ ఏఇ సాయి కుమార్, ఇలియస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మదనంలోని మిషన్ భగీరథ నీటి సరఫరా కేంద్రాన్ని సందర్శించిన చైర్మన్

ఉత్సాహభరితంగా హ్యాపీ సండే ఫన్ డే

కొత్తూరు, మార్చి 29, ప్రభాతవార్త : కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడలో ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో హ్యాపీ సండే ఫన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ కాలనీలోని చిన్నారులతో కలిసి యోగా అభ్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా పొందవచ్చని తెలిపారు. నిత్య జీవితంలో ఒత్తిడిని తగ్గించుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని ఆమె వివరించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈ హ్యాపీ సండే ఫన్ డే నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.బాలాజీ, వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు పి. మాధవి గోపాల్, కోస్గి శ్రీనివాస్, బ్యాగరి ప్రసన్నలత యాదయ్య, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు

కొడంగల్, మార్చి 29, ప్రభాతవార్త : కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ ఆదివారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని కొనియాడారు. మున్సిపాలిటీలో రూ.400 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, రైతుల సౌకర్యార్థం నక్ష బాటల పునరుద్ధరణ చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయం సమీపం నుండి తిరుమలాపూర్ అడివ వరకు గల నక్ష బాట పనులను ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రేస్ నాయకులు బత్తుల నరసింహ, ఊట్కూర్ శ్రీనివాస్‌రావు(రాజు), పాశం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను ప్రారంబిస్తున్న మున్సిపల్ చైర్మేన్

శ్రీమతి ..ఓ బహుమతి

బేగంపేట టూరిజం ప్లాజాలో పరివర్తన మీడియా ఆధ్వర్యంలో 'శ్రీమతి మహిళా కంటెస్ట్'లో పాల్గొన్న మహిళలు

ఉల్లాస్ పరీక్షలు రాస్తున్న మహిళలు

అమ్మకు అక్షర మాల

-ఉత్సాహంగా ఉల్లాస్ పరీక్షలు

-జిల్లాలో 77,774 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించాం

-మొదటి విడత పరీక్షకు 38,869 హాజరు

రంగారెడ్డి అర్బన్, మార్చి 29, ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన వారికి అక్షర వెలుగులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యల్లో భాగంగా ఉల్లాస్ (లైఫ్‌లాంగ్ లెర్నింగ్ అవగాహన కార్యక్రమం) పరీక్షలు జిల్లాలో ఉత్సాహంగా నిర్వహించారు. విద్యాశాఖ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియ కొనసాగుతోందని వయోజన విద్యా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అనిత తెలిపారు. ఆదివారం గ్రామాల వారీగా శిక్షణ పూర్తిచేసుకున్న వయోజనులకు పరీక్షలు నిర్వహించగా, ముఖ్యంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించిన అనిత మాట్లాడుతూ, ఈ పరీక్షల ద్వారా మహిళల్లో విద్యా చైతన్యం పెరుగుతుందని, సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో అక్షరాస్యత పెంపుదల లక్ష్యంగా స్వశక్తి సంఘాల్లో చదువు రాని, మధ్యలో మానేసిన వారిని గుర్తించి వారికి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతతో పాటు ఆర్థిక, డిజిటల్, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య అవగాహన కూడా కల్పిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 73,832 మంది నిరక్షరాస్యులను గుర్తించాల్సి ఉండగా, లక్ష్యాన్ని మించి 77,774 మందిని గుర్తించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మొదటి విడతలో 38,869 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. జిల్లాలోని 27 మండలాల్లో 558 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి, 21 గ్రామీణ, 6 పట్టణ మండలాల్లో పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మిగతా అభ్యర్థులకు రెండో విడత పరీక్షలు ఏప్రిల్ 15న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, గ్రామీణ అభివృద్ధి సంస్థల సహకారంతో అక్షరాస్యతను మరింత పెంచడమే లక్ష్యమని అనిత స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఎంఈఓ, ఎపియం, సిసిలు, విఓఏలు పరీక్షలను నిర్వహించారు. గ్రామసంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

వాహనదారుల భద్రతే పధాన లక్ష్యం

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా

మోమిన్‌పేట్, మార్చి 29, ప్రభాతవార్త: వాహనదారుల భద్రత కొరకు పోలీసులు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర గౌరవ డీజీపి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఆదివారం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ఏజేఆర్ గార్డెన్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహా మెహ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. డీజీపి మార్గదర్శకత్వంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం మూడవ విడతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు.

ఈ ఉచిత వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు వాహనదారులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మోమిన్‌పేట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకట్, దారూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రఘు రాములు, ఎంపీఓ లక్ష్మీ, మోమిన్‌పేట్ సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్, ఎస్ఐలు భరత్ భూషణ్, పోలీస్ సిబ్బంది, వాహనాదారులు, స్థానిక ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట మండల బిజెపి ఎస్టీ మోర్చా అధ్యక్షులుగా ధీరావత్ భీమానాయక్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్. పాల్గొన్న మండల బిజెపి నాయకుల దృశ్యం

యువనాయకత్వానికి ప్రాధాన్యం

శామీర్‌పేట, మార్చి 29, ప్రభాతవార్త : శామీర్‌పేట మండల బిజెపి ఎస్టీ మోర్చ అధ్యక్షులుగా ధీరావత్ భీమానాయక్ (తుర్కపల్లి తండ) నియమితులయ్యారు. ఆదివారం శామీర్‌పేట మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్ ఆయనను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి తండకు చెందిన ధీరావత్ భీమానాయక్‌ను మండల బిజెపి ఎస్టీ సెల్ అధ్యక్షులుగా నియమించారు. పార్టీ అభివృద్ధిలో భాగంగా వివిధ మోర్చాల అధ్యక్షులను నియమించటం జరుగుతుందని, యువకులకు పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందరి నాయకుల సూచనల మేరకు మండల ఎస్టీసెల్ అధ్యక్షులుగా ధీరావత్ భీమానాయక్‌ను నియమించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శామీర్‌పేట మండల బిజెపి ఎస్టీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన ధీరావత్ భీమానాయక్ మాట్లాడుతూ మండల ఎస్టీ మోర్చ అధ్యక్షులుగా నియమించిన మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్‌కు ఆయన దన్యవాదాలు తెలిపారు. అదే విధంగా సహకరిస్తున్న మండల, జిల్లా, రాష్ట్ర నాయకులకు ప్రతి ఒక్కరికి ఆయన దన్యవాదాలు తెలియజేశారు. మండల ఎస్టీమోర్చ అధ్యక్ష పదవికి నన్ను నియమించటం సంతోషంగా ఉందని, బిజెపి పార్టీని మరింత బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని ధీరావత్ భీమానాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఉపాధ్యక్షులు నీరుడి అశోక్‌కుమార్, మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కీసరి నర్సింగ్‌రావు, మాజీ బిజెవైఎం అధ్యక్షులు జివికె యాదవ్, నాయకులు కీసరి సత్యనారాయన, గ్రామ అధ్యక్షులు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ భూములు లాక్కుంటున్నారు

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం

చేవెళ్ల, మార్చి 29, ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లాలో రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా సీఎం రేవంత్ రెడ్డి భూములను లాక్కుంటున్నారని మాజీ మంత్రి సవిత ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ సీఎం వ్యవహార తీరును ప్రశ్నిస్తున్న తమను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకొని వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. అడ్డగోలుగా జీవోలు ఇచ్చి భూములు ఎందుకు తీసుకుంటున్నారని, మేము అడిగితే వ్యక్తిగతంగా మమ్మల్ని టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. రేవంత్ రెడ్డి పద్ధతిగా పాలన చేస్తే అసెంబ్లీలో ఎందుకు ప్రతిపక్షానికి మైక్ ఇవ్వడం లేదు? ఎందుకు మేము మాట్లాడుతుంటే మైక్ కట్ చేస్తున్నారన్నారు. నిజంగా ఈ ప్రభుత్వం ఏ తప్పు చేయకపోతే హౌస్ కమిటీ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. బలవంతపు భూసేకరణపై హౌస్ కమిటీ వేయాలని మేము డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో ఉన్మాదం

స్థానికులపై కత్తితో దాడి- ఇద్దరికి తీవ్ర గాయాలు

ధారూర్, మార్చి 29, ప్రభాతవార్త: ధారూర్ మండల పరిధిలోని నాగసాన్‌పల్లి గ్రామంలో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఇద్దరు యువకులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగసాన్‌పల్లికి చెందిన నాగార్జున అనే యువకుడు శనివారం సాయంత్రం తన పొలం వద్ద పనిలో నిమగ్నమై ఉన్నాడు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన వడ్డే రమేష్ అనే వ్యక్తి విపరీతంగా మద్యం సేవించి అక్కడికి చేరుకున్నాడు. మత్తులో ఉన్న రమేష్ ఎటువంటి కారణం లేకుండానే తన వద్ద ఉన్న కత్తితో నాగార్జునపై దాడికి తెగబడ్డాడు. ప్రాణాపాయం నుంచి తప్పించుకునే క్రమంలో నాగార్జున పెద్దగా కేకలు వేయగా, సమీపంలోనే ఉన్న మహిపాల్ అనే యువకుడు దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించాడు. ఆగ్రహంతో ఊగిపోయిన రమేష్, మహిపాల్‌పై కూడా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో నాగార్జున తలకు తీవ్రమైన గాయం కాగా, మహిపాల్ చేయి విరిగింది. వెంటనే స్పందించిన స్థానికులు గాయపడిన ఇద్దరినీ వికారాబాద్‌లోని ప్రైవేట్ ఇషా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ ఘటనపై విచారణ చేపట్టారు. నిందితుడు వడ్డే రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.